సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



ఆశ్రమ క్రీడలు ప్రారంభం

కిన్నెరసానిలో ఉమ్మడి జిల్లా స్థాయి గిరిజన పాఠశాలల క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి.

10లో



'ఈసారీ... ఒకటే 'శారీ'

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి మహిళా ఎమ్మెల్యే ఒక్కరే విజయం సాధించారు.

8లో

గరిష్టం / కనిష్టం
28° / 17°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని నాలుగు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పి.రాంబాబు గురువారం తనిఖీ చేశారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, చుంచుపల్లి మండలాల్లోని కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 160 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ ఆన్‌లైన్ చేయాలని అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగులను పరిశీలించి రైతులకు అందజేసిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చేముందు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ములకలపల్లి: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అధికారులను ఆదేశించారు. పూసుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. నడిపల్లి నవీన్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

కొండరెడ్ల గ్రామాలను సందర్శించిన పీఓ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

అశ్వారావుపేట రూరల్ : మండల పరిధిలోని కొండరెడ్ల గ్రామాలను భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ గురువారం సందర్శించారు. బండారిగుంపు, రెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించి ఐటీడీఏ నిధులతో నిర్మించిన ఇళ్లు, సీసీ రోడ్లను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. బండారిగుంపులో వీధిలైట్లు ఏర్పాట్లు చేయాలని స్థానికులు, రెడ్డిగూడెంలో నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని, డ్రెయినేజీలకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ యాట్ల మహేశ్వర్ రెడ్డి విన్నవించగా, పీఓ సానుకూలంగా స్పందించారు. అనంతరం సున్నంబట్టి గ్రామాన్ని సందర్శించి, ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ, బోధన తదితర అంశాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఐటీడీఏ డీఈఈ ఎం.రావిఎరెడ్డి, ఏఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

అసలేం జరిగింది?

బీఆర్‌ఎస్‌లో మొదలైన అంతర్మథనం

- నియోజకవర్గాల్లో జోరుగా గులాబీ శ్రేణుల చర్చ
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై నేడు సమీక్ష
- భవిష్యత్ కార్యాచరణపై వ్యూహరచన



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల ఫలితాలు వెల్లడై పది రోజులైంది. విజయం తమదేనని భావించిన భారత రాష్ట్ర సమితికి చేదు అనుభవం ఎదురైంది. కచ్చితంగా గెలుస్తామనే స్థానాల్లోనూ పరాజయం పలకరించింది. కాంగ్రెస్ వేవ్ ఉందని పైకి ఎంతగా చెప్పుకున్నా కారు జోరు కొనసాగకపోవడానికి కారణాలేంటనే అంశంపై ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. నియోజకవర్గాల వారీగా ఓటమికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ? వ్యూహాత్మక తప్పిదాలు ఎక్కడ జరిగాయనే అంశంపై పార్టీ పరంగా చర్చ షురువైంది. ఫలితాలు వెలువడిన కొన్ని రోజుల్లోనే పార్టీ అధినేత కేసీఆర్ గాయపడటం, ఆపరేషన్ జరగడంతో గులాబీ నేతలు ఆందోళన పడ్డారు. కేసీఆర్ ఆపరేషన్ విజయవంతం కావడం, ఈ విషయాన్ని కేసీఆరే స్వయంగా చెప్పడంతో జిల్లా బీఆర్‌ఎస్ నేతలు పార్టీ పరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉన్న తెలంగాణ భవన్‌లో ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఇప్పటికే ప్రకటించారు.

- **కొత్తగూడెం** నియోజవకర్గంలో గడిచిన రెండేళ్లుగా బీఆర్‌ఎస్ పరిస్థితి గందరగోళంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు పోటీగా బరిలో నిలిచేందుకు అనేక మంది ఆసక్తి చూపించారు. ముఖ్యంగా జీఎస్‌ఆర్ ట్రస్టు పేరుతో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు నియోజకవర్గంలో హల్‌చల్ చేశారు. ఒక దశలో కాబోయే బీఆర్‌ఎస్ అభ్యర్థి గడలే అన్నంతగా ప్రభావం చూపారు. ఇంతలో అనర్హత కేసుతో మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు మరోసారి ప్రాచుర్యంలోకి వచ్చారు. వెరసి 2023 ఆగస్టు వరకు ఇక్కడి సిట్టింగ్ వనమాకు చిక్కులే ఎదురయ్యాయి. ఆ తర్వాత పార్టీ అంతా వనమా వెంటే నిలబడింది. ఇతర పార్టీ నేతలు గులాబీ దళంలో చేరారు. పొత్తుల్లో భాగంగా కాంగ్రెస్ బదులు సీపీఐ నుంచి అభ్యర్థి ఇక్కడ బరిలో ఉన్నారు. దీంతో గెలుపు వనమాదే అన్నంత ధీమా బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కనిపించింది. కానీ తీరా ఫలితాలు వెల్లడైన తర్వాత బీఆర్‌ఎస్ ఏకంగా మూడో స్థానంలో నిలవడం ఆ పార్టీ కార్యకర్తలకే మింగుడుపడటం లేదు. గెలవకపోయినా కనీసం రెండో స్థానం కూడా దక్కకపోవడంపై పార్టీ పరంగా చర్చ జరిగేందుకు ఆస్కారం ఉంది.
- **పినపాక** నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ రేగా కాంతారావు బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు, రేగాల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని ఎన్నికలకు ముందు అంతా భావించారు. కానీ పోలింగ్‌కు రెండు రోజులు ముందు నుంచి నియోజకవర్గంలో పరిస్థితులు వేగంగా మారిపోయాయి. పోలింగ్ రోజున రేగాకు ఎదురైన అడ్డంకులతో బీఆర్‌ఎస్‌కు చేదు ఫలితం తప్పదనే భావన పార్టీ కేడర్‌లో కలిగింది. లెక్కింపులోనూ అదే విషయం రుజువైంది. ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు నుంచే అసమ్మతిపై ఫోకస్ చేసినా గెలుపు దక్కకపోవడానికి గల కారణాలను అన్వేషించే పనిలో గులాబీ నేతలు ఉన్నారు.
- **అశ్వారావుపేట** నియోజకవర్గం నుంచి తొలిసారిగా పోటీ చేసిన జారె ఆదినారాయణ బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా జారె ప్రకటన తర్వాత నియోజకవర్గానికి చెందిన పేరెన్నికగల కాంగ్రెస్ నాయకులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ ఇవేమీ మెచ్చా గెలుపునకు బాటలు వేయలేకపోయాయి. నియోజకవర్గంపై పట్టున్న సీనియర్ నేతలు తుమ్మల, జలగం మద్దతుదారులతోపాటు పొంగులేటి ప్రభావం బలంగా కనిపించడంతో కారు జోరుకు బ్రేకులు పడ్డాయనే అభిప్రాయం నెలకొంది.
- **ఇల్లెందు** నియోజకవర్గంలో ఎన్నికలకు ఏడాది ముందు నుంచే బీఆర్‌ఎస్ పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయి. ఇల్లెందు మున్సిపాలిటీ కేంద్రంగా మొదలైన ముసలం ఎన్నికల షెడ్యూల్ వచ్చేనాటికి నియోజకవర్గం మొత్తం పాకింది. దాని ఫలితంగానే ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ పరాజయం పాలయ్యారు. అంతర్గత కుమ్ములాటలు, మితిమీరిన ఆధిపత్య ప్రదర్శనపై సమీక్షలో చర్చించేందుకు ఈ నియోజకవర్గ నాయకులు సమాయత్తం అవుతున్నారు.
- **భద్రాచలం** నియోజకవర్గంలో అందరి అంచనాలు తలకిందులు చేస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకటరావు విజయం సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రస్తుతం ఆయనొక్కరే బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- **కార్యాచరణ** ఓటమికి కారణాలను విశ్లేషించుకుని లోపాలను సవరించుకోవడంతోపాటు రాబోయే రోజుల్లో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర ఎలా పోషించాలనే అంశంపై కూడా బీఆర్‌ఎస్ నేతలు ఫోకస్ చేయబోతున్నారు. జిల్లాలో ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై పార్టీ పరంగా నజర్ పెట్టనున్నారు.

భద్రగిరి రామయ్యకు భక్తుల జేజేలు

- కూర్మావతారంలో శ్రీ సీతారామ చంద్రస్వామివారి దర్శనం
- భద్రాచలంలో రెండో రోజుకు చేరిన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న స్వామివారికి హారతిని ఇస్తున్న అర్చకులు

భద్రాచలం: క్షీరాబ్ధి సమయంలో మందరగిరిని తన వీపున మోసి దేవతలకు అమృతం అందించి కూర్మావతారంలో దర్శనమిచ్చిన కమనీయ రాముడికి భక్తజనులు జేజేలు పలికారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరగా, భద్రగిరి రామయ్య కూర్మావతారంలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన, ఆరగింపు ఇచ్చారు. వేద పండితులు స్వామివారికి దివ్య ప్రబంధం చేశారు. రెండు వందల నాళాయిర దివ్య ప్రబంధాలను చదివారు. పన్నెండు మంది ఆళ్వార్లకు పరివట్టం కట్టి పూలమాలలు వేసి తులసీదళాలు సమర్పించారు. అనంతరం కూర్మావతారంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చారు.

మిథిలా స్టేడియంలో భక్తుల నీరాజనం

ప్రత్యేక పల్లకీపై స్వామివారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ మాడ వీధుల మీదుగా మిథిలా స్టేడియం ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చి హారతులను సమర్పించారు. అప్పటికే బారులుదీరిన భక్తులు రామయ్యను దర్శించుకుని నైవేద్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకస్వాములు ఆశీర్వచనాలు అందచేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన సంగీత, నృత్య, కచేరి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వైభవంగా తిరువీధి సేవ

అధ్యయనోత్సవ వేదికపై ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు ఊరేగింపుగా తిరువీధి సేవకు వెళ్లారు. తాతగుడి వీధిలోని విశ్రాంత మండపం వద్దకు తీసుకెళ్లి అక్కడ కొద్దిసేపు ఉంచి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఊరేగింపుగా స్వామివారిని గర్భగుడికి తీసుకొచ్చారు. దారిపొడవునా భక్తులు పూజలు నిర్వహించి ప్రసాదాలు అందుకున్నారు.

నేడు వరాహావతారంలో..

అధ్యయనోత్సవాలలో భాగంగా రామయ్య శుక్రవారం వరాహావతారంలో దర్శనమివ్వనున్నారు. ప్రజా సృష్టి చేద్దామనుకున్న స్వాయంభువుని, బ్రహ్మాదుల మొర విన్న నారాయణుడు నీటిలో మునిగి ఉన్న భూమిని బయటికి తీయడానికి వరాహావతారాన్ని ధరించాడు. భూమిని తన కోరలతో పైకెత్తాడు. ఈ కార్యంలో ఆటంకం కలిగించిన లోకకంటకుడైన హిరణ్యాక్షుడు అనే రాక్షసుడిని సంహరించి భూమిని రక్షించాడు. రాహు గ్రహ బాధలు ఉన్న వారు ఈ అవతారాన్ని వీక్షిస్తే విముక్తులవుతారని ప్రతీతి.

ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందించిన అధికారులు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుంచుపల్లి, బాబుక్యాంపులోని భవిత కేంద్రంలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దివ్యాంగులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎల్ఐఎంసీఓ సంస్థ ద్వారా మంజూరైన ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలను దివ్యాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమ్మిళిత విద్యా కో-ఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు, ఎంఈఓ జుంకీలాల్, సర్పంచ్ బాబూరావు, పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' ఇంకా లేటే..!



అసంపూర్తిగా నిలిచిన కొత్తగూడెం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- రైతులకు అందుబాటులోకి రాని సమీకృత మార్కెట్లు
- మూడు మున్సిపాలిటీల్లోనూ అసంపూర్తి పనులే
- కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసినా కనిపించని ఫలితం
- కొత్త ప్రభుత్వంలో అయినా సజావుగా సాగేనా..?

కొత్తగూడెంఅర్బన్: పట్టణాల్లో నివసించే ప్రజలకు మార్కెట్‌లో అన్నీ ఒకే దగ్గర లభ్యం కావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల పరిధిలో గతంలో ఉన్న రైతుబజార్లను కూల్చివేసి వాటి స్థానంలో నూతన మార్కెట్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులకు 2022 మార్చిలో శంకుస్థాపన చేశారు. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో ఇంకా పిల్లర్ల దశలోనే పనులు జరుగుతున్నాయి. ఇల్లెందు మున్సిపాలిటీలో మాత్రం కొంత మెరుగ్గా స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పట్టణాల్లో పనుల జాప్యంపై కాంట్రాక్టర్లకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా పురోగతి లేదు. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం రైతుబజార్‌ను కూల్చివేసి, దానికి ఎదురుగా ఉన్న స్థలంలో అధికారులు తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. అయితే వర్షం కురిసినా, అధికంగా ఎండ వచ్చినా రైతులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతుబజార్ ఉన్నప్పుడు తమకు అనుకూలంగా ఉండేదని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం దాన్ని కూల్చివేయడంతో పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండెకరాలు..115 స్టాళ్లు..

మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు పట్టణాల్లో ఒక్కో మార్కెట్‌ను రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇల్లెందులో రూ.8 కోట్లతో నూతన మార్కెట్ నిర్మిస్తున్నారు. ఒక్కో మార్కెట్ రెండెకరాల స్థలంలో 115 స్టాళ్లతో నిర్మించాల్సి ఉంది. వీటిలో కూరగాయలు, నాన్ వెజ్, పండ్లు, పూల మార్కెట్లను నిర్మించనున్నారు. నాలుగు రకాల మార్కెట్లూ ఒకే చోట ఉండటంతో వినియోగదారులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు మంజూరైన విషయం తెలిసి ఆనందం వ్యక్తం చేసిన పట్టణ వాసులు.. ఇప్పుడు పనుల జాప్యంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెంలో రైతుబజార్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతుండగా, పాల్వంచలోని రైతుబజార్‌ను అనుసంధానం చేస్తూ మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల మధ్యలో ఉన్న స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. ఇల్లెందులో పాతబస్టాండ్ ప్రాంతంలో గతేడాది నుంచి పనులు జరుగుతూ, ప్రస్తుతం స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. మణుగూరులో మార్కెట్ పనులు గ్రౌండ్ లెవల్‌లోనే ఉన్నాయి. ఈ నాలుగు మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు ఎప్పుడు పూర్తయి, అందుబాటులోకి వస్తాయా అని ఆయా పట్టణాల వాసులు ఎదురుచూస్తున్నారు.

ప్లాన్ మార్పుతో ఆందోళన..

కొత్తగూడెంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల ప్లాన్‌లో మార్పులు చేయడంతో రైతుబజార్‌లో విక్రయించే రైతులు ఇటీవల ఆందోళన చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో షెడ్ల నిర్మాణానికి షట్టర్లు మార్కెట్ లోపలి భాగంలో వచ్చేలా ముందు నిర్ణయించిన ప్రణాళికలో ఉంది. కానీ కొందరు కౌన్సిలర్ల ప్రమేయంతో కాంట్రాక్టర్ ప్లాన్‌లో మార్పులు చేసి షట్టర్లు బయట వైపు ఉండేలా నిర్మిస్తున్నారని, ఈ విషయాన్ని నూతన ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లామని రైతుబజార్ వ్యాపారులు తెలిపారు. ప్రజాప్రతినిధుల స్వలాభం కోసం మార్పు చేయడం సరికాదని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

స్లాబ్ లెవల్లో ఉన్నాయి

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు స్లాబ్ లెవల్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రివ్యూలు నిర్వహించి నిర్ణయం తీసుకున్న తర్వాత పనులు మళ్లీ ఊపందుకుంటాయి. పనులు చివరి దశకు చేరుకున్నందున త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది.

– శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ డీఈ

ఇంత అలసత్వం ఎందుకు?

- సీతారామ పనుల్లో ఆలస్యంపై మంత్రుల అసంతృప్తి
- జిల్లా మంత్రులతో కలిసి సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగు, తాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతుండడంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి ఆయన హైదరాబాద్‌లో గురువారం సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా గడచిన ఐదేళ్లలో సీతారామ పనుల్లో పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు ఏ మాత్రం ప్రణాళికాయుతంగా సాగడం లేదని తెలిపారు. సమీక్షలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఏ పనికి ఎన్ని నిధులు అవసరమనే అంచనాలు లేకపోవడంతో సమస్య తలెత్తుతోందని చెప్పారు. ఇకనైనా సీతారామ ప్రాజెక్టు హెడ్‌వర్క్స్, కాల్వలు, భూసేకరణకు ఎంత మేర నిధులు అవసరమో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. సీతారామ పనులు త్వరగా పూర్తయ్యేలా కార్యాచరణ ఉండాలన్నారు. కాగా, ఖమ్మం జిల్లాలోని బుగ్గవాగు చెక్‌డ్యాంను గతంలో తాను మంత్రిగా ఉన్న సమయాన నిర్మించినా ఆతర్వాత ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఫలితంగా రఘునాథపాలెం మండలానికి సాగునీరు అందడం లేదని, సీతారామ పూర్తయ్యాక బుగ్గవాగును అనుసంధానిస్తామన్నారు. సాగర్ ఆయకట్టుకు యాసంగికి సాగునీరు ఇచ్చే అంశంపై రైతులకు స్పష్టతనివ్వాలని మంత్రి సూచించారు.

ఓ యువా..!



- ఈ నెల 21న జిల్లాస్థాయి యువజనోత్సవాలు
- సామూహిక, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు
- కొత్తగూడెం క్లబ్ వేదికగా ఉత్సవాలు

కొత్తగూడెంటౌన్: జాతీయ యువజనోత్సవాలు సమీపిస్తున్నాయి. ఈలోపే జిల్లాస్థాయిలో వేడుకలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయికి పంపించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఈ నెల 21వ తేదీన కొత్తగూడెం క్లబ్‌లో ఉత్సవాలు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభం కానుండగా, ప్రతిభ చూపిన యువజన కళాకారులను ఎంపిక చేయనున్నారు.

పోటీలకు అర్హతలు

- యువజనోత్సవాల్లో పాల్గొనే కళాకారులు 15 నుంచి 29 ఏళ్ల వయసులోపు ఉండాలి. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.
- రాష్ట్రస్థాయిలో ఎంపికైన కళాకారులను జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నారు.

సామూహిక ప్రదర్శనలు

- జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ గ్రూప్) ఒక్కో బృందంలో 10 మంది మాత్రమే ఉండాలి.ప్రదర్శనలో జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. ప్రదర్శనకు 15 నిమిషాల సమయం మాత్రమే ఇస్తారు.
- జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ సోలో) ఒక్కో బృందంలో ఐదుగురు మాత్రమే ఉండాలి. జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. నృత్య ప్రదర్శన సమయం 7 నిమిషాలు మాత్రమే.
- జానపద గేయాలు(ఫోక్ సాంగ్ గ్రూప్) ఒక్కో బృందంలో అందరు కలిపి 10 మంది వరకు మాత్రమే ఉండాలి. ప్రదర్శనలో జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలను అనుమతించారు. ప్రదర్శన సమయం 7 నిమిషాలు మాత్రమే.
- జానపద గేయాలు (ఫోక్ సాంగ్ సోలో) ఒక్కో బృందంలో ఐదుగురు మాత్రమే ఉండాలి. నృత్య ప్రదర్శన సమయం 7 నిమిషాలు మాత్రమే.
- గ్రూప్ విభాగాల్లో మొత్తం యువకులు లేదా యువతులు లేదా యువతీయువకులు ఉండవచ్చు. వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలి. లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యమిస్తారు.

వ్యక్తిగత ప్రదర్శనలు

- వ్యాసరచన పోటీలు(స్టోరీ రైటింగ్): ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లంలో 60 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఒకసారి ఎంపిక చేసిన అంశం మార్చేందుకు వీలులేదు.
- పోస్టర్ మేకింగ్ (పెయింటింగ్) చేసేందుకు 90 నిమిషాల సమయం ఇస్తారు. ఏ3 సైజ్ పేపర్ మీద మాత్రమే వేయాలి. పెయింటింగ్ సామగ్రి తెచ్చుకోవాలి.
- వక్తృత్వ పోటీలు: అభ్యర్థులు లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లంలో 3 నిమిషాల్లో మాట్లాడాలి. ఒకసారి ఎంపిక చేసిన అంశం మార్చడానికి వీలుకాదు.
- ఫొటోగ్రఫీ : ఫొటోగ్రఫీలో పాల్గొనేవారు రెండు ఫొటోగ్రాఫ్స్ మొబైల్, కెమెరాతోపాటు ప్రింట్లు తీసుకురావాలి. ఫొటో 1 ఎంబీకి తక్కువ కాకుండా 2 ఎంబీకి ఎక్కువ కాకుండా చూడాలి. ప్రగతిశీల్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్, యోగా, క్రీడలు, శారీరక శ్రమ, ప్రకృతి దృశ్యం వంటి అంశాలలో ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయి.

యువక్రితి: యువతీ, యువకులకు దేశంలోని వివిధ ప్రాంతాల హస్తకళలను అర్థం చేసుకునేందుకు అభినందించేదుకు ప్రత్యేక అవకాశం ఇస్తారు. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరీలో గరిష్టంగా ఇద్దరిని ఎంపిక చేస్తారు.


19లోగా వివరాలు అందించాలి



యువజనోత్సవాల్లో పాల్గొనాలనుకునేవారు ఈ నెల 19వ తేదీలోగా వివరాలు అందజేయాలి. పేరు, పుట్టినతేదీ, వయసు, ఆధార్‌కార్డు, అడ్రస్, ఫోన్ నంబర్ ప్రదర్శనల వివరాలను yuvautsav2024@gmail.com కు మెయిల్ చేయా లి. జిల్లా యువజన క్రీడలశాఖ కార్యాలయం (ఐడీఓసీ జీ–19)లో స్వయంగా కూడా అందజేయవచ్చు. వివరాలకు 9505423226 ను సంప్రదించాలి.

–పి.పరంధామరెడ్డి, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి

కరాటే విజేతకు కలెక్టర్ అభినందన



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అండర్–17 స్కూల్ గేమ్స్‌లో కరాటే విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కొత్తగూడేనికి చెందిన విద్యార్థి డి.సాయివరుణ్‌ను గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తన చాంబర్‌లో అభినందించారు. ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే సాయివరుణ్ కరాటే కోచ్ ఇంద్ర శ్రీధర్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ పొందుతున్నాడు. జాతీ యస్థాయిలో సత్తాచాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

క్లుప్తంగా

భద్రాద్రి ఆలయ క్యాలెండర్ల విక్రయాలు ప్రారంభం


క్యాలెండర్ విక్రయిస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యాన ముద్రించిన 2024 సంవత్సరం క్యాలెండర్ల విక్రయం గురువారం ప్రారంభమైంది. గతంలో దేవస్థానం పాలకమండలి ఉన్న సమయాన ఏటా రామయ్య మూలవిరాట్ ఫొటోతో క్యాలండర్లు ముద్రించి విక్రయించేవారు. కొనేళ్లుగా పాలక మండలి లేక పోవడంతో నిలిపివేశారు. ఈ ఏడాది ఈఓ రమాదేవి చొరవతో క్యాలెండర్లు ముద్రించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఒక్కో క్యాలెండర్‌ను రూ.120 చొప్పున ప్రత్యేక కౌంటర్ ద్వారా విక్రయిస్తుండగా భక్తులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

టేకులపల్లిలో జెట్ విమానం చక్కర్లు


చక్కర్లు కొడుతున్న విమానం

టేకులపల్లి: టేకులపల్లి గగనతలంపై గురువారం జెట్ విమానం చక్కర్లు కొట్టింది. కొత్తగూడెం వైపు నుంచి టేకులపల్లి మీదుగా ఇల్లెందు వైపునకు రెండు సార్లు అటు ఇటు తిరిగింది. ఈ విమానం చాలా తక్కువ ఎత్తు నుంచి వెళ్తుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ విషయమై టేకులపల్లి ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి వివరణ కోరగా... శిక్షణకు సంబంధించినది కావొచ్చని, తమకు ఎలాంటి సమాచారమూ లేదని తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం జూలూరుపాడు, సుజాతనగర్, కొత్తగూడెం, అశ్వాపురం ప్రాంతాల్లో విమానాలు చక్కర్లు కొట్టిన విషయం విదితమే.

రేపు కోదండరాం సన్మాన సభ

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం సరోజనాపురంలో శనివారం సన్మానిస్తున్నట్లు తెలంగాణ యూత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పానుగోటి సంపత్ తెలిపారు. ఈకార్యక్రమానికి ఉద్యమ మేధావులు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. యువత, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పాల్వంచ: ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడుకు చెందిన చిట్టూరి కోటేశ్వరరావు కొత్తగూడెం నుండి కాకినాడకు ట్రాలీ ఆటోలో పది క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నాడు. పాల్వంచ బస్టాండ్ వద్ద పోలీసులు గురువారం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడగా, రూ.16వేల విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవయ్య తెలిపారు.

ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచ: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసిన వ్యక్తిపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన అరవ సురేందర్ తన బంధువైన హన్మకొండకు చెందిన కొండ దీపక్‌రెడ్డి నుండి నేషనల్ పోలీస్ అకాడమీలో ఇద్దరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.26లక్షల నగదును ఏడాది క్రితం తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా కనీసం వారికి అందుబాటులోకి రావడం లేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన దీపక్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.


యువతి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని లలితాపురం గ్రామానికి చెందిన యువతి ఇంటి నుంచి అదృశ్యమైందని ఆమె తండ్రి సురేష్ తివారి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రవూఫ్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: పట్టణంలోని పిచ్చయ్య బంజరకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పిచ్చయ్య బంజరకు చెందిన ఎర్రబోయిన నాగేశ్వరరావు గురువారం పురుగుల మందు తాగా, స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియకపోగా, వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

ఈసారీ... ఒకటే 'శారీ'

- ఉమ్మడి జిల్లాలో ఆరో మహిళా ఎమ్మెల్యేగా మట్టా రాగమయి
- పది స్థానాల్లో 27 మంది పోటీ
- గత ఎన్నికల్లో మాదిరి ఒక్కరే ఎన్నిక
- అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికం!



సాక్షి, ఖమ్మం డెస్క్: అవనిలో సగం.. ఆకాశంలో సగం అంటూ మహిళలకు అన్నిరంగాల్లో అగ్రతాంబూలం వేస్తున్నట్లు చెబుతున్నా చట్టసభలకు వచ్చేసరికి ఆ స్థాయిలో అవకాశాలు దక్కడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడంతో అభ్యర్థుల గెలుపోటములను వారు ప్రభావితం చేసే అవకాశముంది. కానీ ప్రధాన పార్టీలేవీ మహిళలకు ఆ స్థాయిలో సీట్లు కేటాయించకపోగా.. సత్తుపల్లి నుంచి మాత్రమే డాక్టర్ రాగమయికి విజయం దక్కింది.

పోటీలో 27మంది

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పది స్థానాల నుంచి 214 మంది అభ్యర్థులు పోటీ పడగా.. ఇందులో మహిళలు 27 మందే ఉన్నారు. ఇక ఇందులో ఇందులో ప్రధాన పార్టీల నుంచి అతి తక్కువ మందికే అవకాశం దక్కింది. ఇల్లెందు బరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బానోతు హరిప్రియ, సత్తుపల్లిలో కాంగ్రెస్ నుంచి మట్టా రాగమయికి మాత్రమే అవకాశం లభించగా... మిగతా వారు ఇతర పార్టీల నుంచి, ఇంకొందరు స్వతంత్రులుగా బరిలో నిలిచారు. అత్యధికంగా ఖమ్మం నుంచి ఆరుగురు మహిళలు పోటీ చేయగా, సత్తుపల్లిలో ఐదుగురు, ఇల్లెందు, భద్రాచలంలో నలుగురు చొప్పున, అశ్వారావుపేటలో ముగ్గురు, పాలేరు, పినపాక నుంచి ఇద్దరేసి అభ్యర్థులు, కొత్తగూడెం నుంచి ఒకరు పోటీ చేశారు. ఇక మధిర, వైరా నుంచి మహిళా అభ్యర్థులే లేకపోవడం గమనార్హం.

ఓట్లు ఉన్నా ఓటింగ్‌కు రాలే...

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తంగా 21,83,235 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళా ఓటర్లు 11,22,203 మంది, పురుషులు 10,60,910 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో గతనెల 30న జరిగిన పోలింగ్‌లో 17,95160 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లలో 9,18,701 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 2,03,502 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇక పురుషుల్లో 8,76,394 మంది ఓటు వేయగా, 1,84,516 మంది ఓటు హక్కు వినియోగానికి ఆసక్తి కనబరచలేదు.

ఇప్పటివరకు ఆరుగురే...

1952లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలుకాగా, తాజా ఎన్నికలతో కలిపితే ఇప్పటివరకు పదహారు సార్లు ఎన్నికలు జరిగాయి. ఇన్నాళ్లలో ఉమ్మడి ఖమ్మం నుంచి కేవలం ఆరుగురు మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1957లో ఖమ్మం ద్విసభ్య స్థానం నుంచి తేళ్ల లక్ష్మీకాంతమ్మ రెండో అభ్యర్థిగా, 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ, 2009లో భద్రాచలం నుంచి కుంజా సత్యవతి, వైరా నుంచి బి.చంద్రావతి గెలిచారు. గత ఎన్నికల్లో ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఈసారి సత్తుపల్లి నుంచి డాక్టర్ రాగమయికి అవకాశం దక్కింది. అంటే 1957, 1972, 2009, 2018, 2023 ఎన్నికలు మినహాయిస్తే మిగతా ఏ ఎన్నికల్లోనూ మహిళలు ఎమ్మెల్యేగా ఎన్నికకాలేదు. కానీ 2009 ఎన్నికల్లో ఇద్దరు మహిళలు గెలవడం విశేషం.

119 మందిలో పది మందే...

రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలకు గాను పది మంది మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇందులో కాంగ్రెస్‌కు చెందిన మట్టా రాగమయి (సత్తుపల్లి), సీతక్క(ములుగు), కొండా సురేఖ (వరంగల్ తూర్పు), యశస్వినిరెడ్డి(పాలకుర్తి), పద్మావతి(కోదాడ), పర్ణికారెడ్డి(నారాయణపేట) ఉన్నారు. ఇక బీఆర్‌ఎస్ తరఫున కోవ లక్ష్మి(ఆసిఫాబాద్), సునీతాలక్ష్మారెడ్డి(నర్సాపూర్), సబితాఇంద్రారెడ్డి(మహేశ్వరం), లాస్యనందిత(కంటోన్మెంట్) ఎన్నికయ్యారు.

డాక్టరమ్మ.. ఆరు నెలల్లోనే!



సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన మట్టా రాగమయి స్థానికులకు వైద్యురాలిగానే కాక సేవా కార్యక్రమాల ద్వారా చిరపరిచితులే. సత్తుపల్లి నుంచి 2014 ఎన్నికల్లో ఆమె భర్త డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ వైఎస్సార్ సీపీ తరఫున పోటీకి దిగారు. ఆయన ఎస్సీ సర్టిఫికెట్‌పై వివాదం ఉండడంతో.. ప్రభుత్వ వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తున్న రాగమయి రాజీనామా చేసి డమ్మీ నామినేషన్ దాఖలు చేశారు. కానీ దయానందే పోటీలో నిలిచినా విజయం దక్కలేదు. ఇక 2018 ఎన్నికల్లో పోటీకి అవకాశం రాలేదు. అనంతరం పరిణామాలతో బీఆర్‌ఎస్‌లో చేరిన దయానంద్ కొద్దినెలల క్రితం కాంగ్రెస్‌లోకి వచ్చారు. అంతకు ముందే ఆయన ఎస్సీ సర్టిఫికెట్‌ను కలెక్టర్ రద్దు చేయడంతో రాగమయి కాంగ్రెస్ టికెట్ దక్కించుకుని విజయం సాధించారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఆమె నియోజకవర్గంపై పట్టు సాధించి గెలవడానికి వైద్యురాలిగానే కాక ఆశా స్వచ్ఛంద సంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలు కలిసొచ్చాయి.

సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు, నిర్వాహకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రగతి మైదానం ట్రెనింగ్ సెంటర్‌లో సెల్‌ఫోన్ రిపేరింగ్ ట్రెనింగ్ శిక్షణ పూర్తి చేసిన 25 మంది నిరుద్యోగులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ నవీన్‌బాబు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారు స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రామిరెడ్డి, నోడల్ ఆఫీసర్ శివ, వహీద్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో 'ఉన్నతి' ప్రధాన భూమిక


మాట్లాడుతున్న రాష్ట్ర మానిటరింగ్ బృందం హెడ్ రవికాంతారావు

కొత్తగూడెంఅర్బన్/జూలూరుపాడు: ఉన్నత లక్ష్యాల సాధనలో తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలు ప్రధాన భూమిక పోషిస్తాయని, సమర్థవంతంగా అమలు చేస్తే పిల్లలు ఆశించిన సామర్థ్యాలు సాధిస్తారని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర మానిటరింగ్ బృందం హెడ్ రవికాంతారావు తెలిపారు. రాష్ట్ర పరిశీలన బృందం గురువారం జిల్లాలోని ఆరు మండలాల్లో 15 పాఠశాలలను సందర్శించి ఉన్నతి, తొలిమెట్టు, లక్ష్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. మూడు బృందాలుగా విడిపోయి సుజాతనగర్, జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. బ్లాక్ బోర్డుపై తెలుగు, ఆంగ్ల పదాలను విద్యార్థుల చేత రాయించడంతోపాటు చదివించి, లెక్కలు చేయించారు. రికార్డులు తనిఖీ చేశారు. వర్క్ షీట్లను ఉపాధ్యాయులు దిద్దుతున్న తీరు, హ్యాండ్ బుక్ అనుకరణ తదితర విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల్లో బేస్ లైన్ రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించాలని సూచించారు. అనంతరం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వివిధ పాఠశాలల్లో గమనించిన అంశాలను వివరిస్తూ ఉన్నతి అమలు పూర్తి స్థాయిలో జరగాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. మండల విద్యాధికారి, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో బృంద సభ్యులు రమేష్‌రావు, మురళి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి, ఏ.నాగరాజశేఖర్, సైదులు, శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలి


పరుగుపందెం పోటీలో పాల్గొన్న విద్యార్థులు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక, అధికారులు

- కలెక్టర్ ప్రియాంక ఆల
- ఘనంగా 'నవభారత్' క్రీడా సంబురాలు

పాల్వంచ: విద్యార్థులు భవిష్యత్‌లో అందమైన సమాజం ఏర్పాటుకు దోహదపడేలా లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన దిశగా కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ పాఠశాలలో గురువారం 44వ వార్షిక క్రీడా సంబురాలు నిర్వహించగా, కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతిని పోటీలను ప్రారంభించిన ఆమె మాట్లాడారు. ఆటలు విద్యార్థుల మానసికోల్లాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి దోహదం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించగా, పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో ఖో–ఖో కోచ్ ఈ.నరేశ్, నవ లిమిటెడ్ వైస్ చైర్మన్ ఎల్.వీ.శరత్‌బాబు, డీజీఎం ఎం.శంకరయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వీ.శ్రీనివాసరెడ్డితో పాటు బి.కీర్తిశ్రీ రాథోడ్, ఎ.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

కొత్తగూడెంటౌన్: హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వారావుపేట బాబా గుడి వద్ద నివాసం ఉంటున్న మడుపు పాపాచారికి అటెండర్ కాలనీ పక్కన 857 చదరపు గజాల ఇంటి స్థలం ఉంది. ఆ స్థలం తమకు విక్రయించాలని అదే ప్రాంతానికి చెందిన బట్న సుబ్రమణ్యం, బట్న నాగసోమేశ్వరావు, బట్న చిట్టెమ్మ, అశ్వారావుపేట గ్రామపంచాయతీకి చెందిన షేక్ కమురుద్దీన్‌లు బెదిరింపులకు పాల్పడ్డారు. పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. ఈ క్రమంలో ఫెన్సింగ్ వేయించుందుకు 2018, అక్టోబర్ 27న తన స్థలాన్ని చదును చేయిస్తుండగా సుబ్రమణ్యం, నాగసోమేశ్వరావు, చిట్టెమ్మలు వచ్చి.. స్థలం విక్రయించకపోతే చంపుతామని బెదిరించారు. మరుసటి రోజు తెల్ల వారు జామున పాపాచారి ఒక్కడే ఉన్న సమయం చూసి సుబ్రమణ్యం, నాగసోమేశ్వరావు, షేక్ కమురుద్దీన్‌లు ఇంట్లోకి ప్రవేశించి పదునైన ఆయుధాలతో దాడి చేసి హతమార్చారు. మరణించాడని నిర్ధారించుకున్నాక నిందితులు పరారయ్యారు. మృతుడి తమ్ముడు నాగ వెంకటరమణ ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 27 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువుకావడంతో ముగ్గురు నిందితులు బట్న సుబ్రమణ్యం, బట్న నాగసోమేశ్వరావు, షేక్ కమురుద్దీన్‌లకు జీవితఖైదుతో పాటు రూ.7 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బట్న చిట్టెమ్మపై నేరం రుజువుకాకపోవడంతో కేసు కొట్టివేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి వాదనలు వినిపించగా, సిబ్బంది ఎన్. వీరబాబు, వి.నాగేశ్వరావు సహకరించారు.

ప్రజాపంథా సదస్సుకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీల విలీనం సభల విజయవంతానికి శుక్రవారం కొత్తగూడెంలోని ఉర్దూఘర్‌లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెర్ల రంగారెడ్డి తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ, సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీలు వచ్చే మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో సభలు నిర్వహించి ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సదస్సుకు పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు నాయిని రాజు, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ, యదళ్లపల్లి ఆజాద్, ఏదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మ, పి. సతీష్, గుగులోత్ రామచందర్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కుక్క దాడి


తీవ్రంగా గాయపడిన బాలుడు

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్ గ్రామానికి చెందిన మామిడాల సాయి కుమారుడు గౌతమ్‌పై బుధవారం రాత్రి వీధి కుక్క దాడి చేసింది. ముడున్నర ఏళ్ల గౌతమ్ ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీధి కుక్క వచ్చి కరిచింది. తీవ్రరక్తస్రావం కావడంతో బాలుడికి స్థానికంగా చికిత్స అందించి, గురువారం ఖమ్మం తీసుకెళ్లారు. ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు హైదరాబాద్‌కు సిఫారసు చేసినట్లు బాలుడి తండ్రి తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఏడాది జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత గురువారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం పెద్దబజార్‌కు చెందిన ఐత రాజ్యలక్ష్మి వద్ద భద్రాచలానికి చెందిన గుడుమాసు శత్రుఘ్నకుమార్ 2013లో రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. పలుమార్లు అడిగిన అనంతరం 2016లో రూ.8.30 లక్షలకు ఆయన చెక్కు ఇవ్వగా రాజ్యలక్ష్మి తన ఖాతాలో జమ చేస్తే సరిపడా బ్యాలెన్స్ లేనందున బౌన్స్ అయింది. దీంతో రాజ్యలక్ష్మి తన న్యాయవాది ద్వారా నోటీసు పంపినా స్పందించకపోవడంతో కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేసింది. విచారణ అనంతరం శత్రుఘ్నకుమార్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష విధించడమే కాక రాజ్యలక్ష్మికి రూ.8.30లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు. కాగా, ఫిర్యాదాదారు తరఫున న్యాయవాది ఎం.ఎస్.ఆర్.రవిచంద్ర వాదించారు.

కార్మిక హక్కులను కాలరాసిన టీబీజీకేఎస్

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

సింగరేణి(కొత్తగూడెం): టీబీజీకేఎస్ కార్మిక సంఘాల హక్కులను కాలరాసిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. గురువారం పీవీకే–5షాఫ్ట్, జీకే ఓసీలలో జరిగిన పిట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నిన్నటి అధికార పక్షం టీబీజీకేఎస్‌తోపాటు రాబోయే కాలంలో అధికార పక్షంగా చెలామణీ కాబోయే మరో యూనియన్‌తో కార్మికులకు ఒరిగేది ఏమిలేదని పేర్కొన్నారు. కార్మికుల పక్షాన పోరాడేది మాత్రం ఏఐటీయూసీనేనని అన్నారు. జాతీయ కార్మిక సంఘాలను విమర్శించే టీబీజీకేఎస్ ఏమి సాధించిందని ప్రశ్నించారు. సింగరేణిలో రాజకీయజోక్యం పెరిగి, సంస్థ భవిష్యత్ అంధకారంగా మారిందని అన్నారు. హక్కులు, లాభాల వాటా, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, హెల్త్ ఎంఎంసీ, పెన్షన్ స్కీమ్ వంటి సౌకర్యాలను తమ సంఘమే సాధించిందని గుర్తుచేశారు. ఈ నెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలిపించాలని కోరారు. తాము గెలిస్తే కేడర్ స్కీమ్, సొంత ఇంటి పథకం ఇంద 200 గజాల స్థలం, రూ. 20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మల్లికార్జున రావు, బందెల నర్సయ్య, సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, వి.మురళి, ఎస్ నాగేశ్వరావు, రాజేశ్వరరావు, రాంచందర్, భూక్యా రమేష్, కోర్రు రమేష్, శేషగిరి, బండారు మల్లయ్య ప్రసాద్‌బాబు, కృష్ణ , ప్రసాద్, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

ప్రభుత్వ స్థలంలో ఆలయ నిర్మాణంపై వాగ్వాదం

పెనుబల్లి: ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమిస్తున్నారని, తద్వారా తమ పొలానికి వెళ్లే దారి ఉండదంటూ తండ్రీకొడుకులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వీఎం బంజర్‌కు చెందిన రైతు బానోతు మీటు, ఆయన కుమారుడు కృష్ణ పొలం, సాగర్ కాల్వకు మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిలో లంకపల్లి డీఆర్ఓ మేడా రామకృష్ణ, పిచ్చేశ్వరరావు తదితర భక్తులు ఆలయ నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ప్రభుత్వ భూమిలో 'ఈ భూమి ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు చెందినది.. ఇక్కడ అయ్యప్పస్వామి ఆలయం నిర్మిస్తున్నాం' అంటూ ఏర్పాటుచేసేందుకు ఫ్లెక్సీ తీసుకొచ్చారు. అయితే, ఆ భూమిలో ఆలయం నిర్మిస్తే పొలానికి వెళ్లడానికి దారి ఉండదని మీటు, కృష్ణ అడ్డగించే ప్రయత్నం చేశారు. కానీ తమ శాఖ భూమిలో గుడి కట్టుకుంటే అభ్యంతరం ఎందుకని దూషించారంటూ తండ్రీకొడుకులు పురుగుల మందు తాగారు. దీంతో సమీపాన రైతులు వారిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో కల్లూరుకు తీసుకెళ్లారు. ఈమేరకు పూర్తి విచారణ చేపట్టిన తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వరుడికి మరో యువతితో సంబంధం

ఆగిన పెళ్లి, వరుడి ఇంటిపై దాడికి యత్నం

పాల్వంచ: కాసేపట్లో పెళ్లి జరగాల్సి ఉండగా.. వరుడికి మరో యువతితో సంబంధం ఉందని తెలియడంతో వధువు బంధువులు పెళ్లి నిలిపేశారు. పాల్వంచలోని కొమ్ముగూడెంకు చెందిన యువకుడికి, భద్రాచలం యువతితో వివాహం కుదరగా భద్రాచలంలో గురువారం పెళ్లి జరగాల్సి ఉంది. అయితే హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి సదరు పెళ్లికొడుకుతో తనకు చాలా కాలంగా సంబంధం ఉందంటూ ఫొటోలను పెళ్లి కూతురి ఫోన్‌కు పంపించింది. దీంతో వధువు పెళ్లికి నిరాకరించడంతో గంటల ముందు వివాహం నిలిచిపోయింది. ఆతర్వాత పెళ్లికూతురి కుటుంబీకులు, బంధువులు ఆగ్రహంతో పాల్వంచకు చేరుకుని వరుడి ఇంటిపై దాడికి యత్నించారు. దీంతో స్థానిక పెద్దలు జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోగా పోలీసులు ఇరువర్గాలను పిలిపించి చర్చించారు. అయినా సమస్య ఓ కొలిక్కి రాలేదని తెలిసింది.

అప్పుల బాధతో ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గంగారంలో మిఠాయి కొట్టుతో పాటు టిఫెన్ సెంటర్ నడుపుతున్న వగ్యాల చెన్నారావు(36)కు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో బేతుపల్లికి వెళ్లి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. అయినా అప్పులు తీర్చే మార్గం లేక గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చెన్నారావుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఆరోగ్య ఉద్యానం!

పలాస 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి'లో అత్యున్నత వైద్య సేవలు: ఏపీ సీఎం జగన్

- రూ.700 కోట్లతో ఉద్దానానికి సురక్షిత మంచినీరు
- ఉచితంగా మందులు, పెంచిన పింఛన్లతో కిడ్నీ బాధితులకు ఆర్థిక చేయూత
- ఇదీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్..
- ఉద్దానం కిడ్నీ సమస్యలపై గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం



శ్రీకాకుళం జిల్లా మకరాపురంలో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు స్వరూపాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో కిడ్నీ వ్యాధుల బాధితులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పలాసలో కొత్తగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలసి పని చేస్తాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును కంచిలి మండలం మకరాంపురంలో సీఎం జగన్ గురువారం తొలుత ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం రూ.85 కోట్లతో పలాసలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ బాలుర వసతి గృహాన్ని వర్చువల్‌గా ఆరంభించారు. నూతన పారిశ్రామికవాడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలాస రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.



మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మాట నిలబెట్టుకున్న మీ బిడ్డ..

2018 డిసెంబర్ 30న ఇదే పలాసలో మాటిచ్చా. దేవుడి దయతో, మీ అందరికి చల్లని దీవెనలతో మన ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడే 200 పడకలతో కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తెస్తా మని చెప్పా. కిడ్నీ సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా అడుగులు పడతాయని కూడా చెప్పా. 2019 సెప్టెంబర్‌లో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని మంజూరు చేశాం. ఉద్దానం ప్రాంతానికి సురక్షిత మంచి నీటిని తెచ్చేందుకు హిర మండలం రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి ఇంటింటికి తాగునీరు అందించేందుకు 2020 సెప్టెంబర్‌లో సుజలధార పథకం మంజూరు చేశాం.

ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇక్కడి కిడ్నీ రీసెర్చ్, సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి పని చేస్తుంది. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఐసీయూ బెడ్లు కూడా అందుబాటు లోకి వచ్చాయి. ఈ ఫిబ్రవరిలోనే ఇక్కడ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్రపిండాల మార్పిడి చికిత్స) కూడా జరుగుతుంది. అత్యాధునిక సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, యూరాలజీకి అవసరమైన హోల్మియం లేజర్, యూరో డైనమిక్ మిషన్ లాంటి సదుపాయాలన్నీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎక్కడికో పరుగెత్తాల్సిన అవసరం లేకుండా మన ప్రాంతంలోనే బ్రహ్మాండమైన వైద్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఈ రోజు పలాసలో ఉంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బాధిత కుటుంబాలు ఎలా జీవిస్తున్నాయి? డయాలసిస్ కోసం ఎంత ఖర్చు అవుతోంది? వాటిని భరించలేక వారంతా ఎలా ఇబ్బందులు పడుతున్నారో తెలిసిన ప్రభుత్వంగా మీ బిడ్డ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్ పెంచాడు. రూ.2,500 మాత్రమే ఉన్న పెన్షన్‌ను మీ బిడ్డ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా రూ.10 వేలకు పెంచాడు.

శాశ్వత పరిష్కారం దిశగా..

ఉద్దానం ప్రాంతంలో అసలు కిడ్నీ సమస్యలు ఎందుకొస్తున్నాయి? మూల కారణం ఏమిటని తెలుసుకొనేందుకు మీ బిడ్డ ఆరాటపడ్డాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్‌తో పాటు జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టింది. 4 దశల్లో సాగే ఈ అధ్యయనంలో ఇప్పటికే మూడు దశలు పూర్తయ్యాయి. ఉద్దానంలో ఒక్క కిడ్నీ ఆస్పత్రితోనే సరిపుచ్చకుండా సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎవరి ఊహకూ అందని విధంగా రూ.700 కోట్లు ఖర్చు చేసి మరీ హిరమండలం నుంచి పైపుల ద్వారా నీళ్లు తెచ్చి ఈ ప్రాంతానికి మంచి చేసేలా అడుగులు వేశాం. ఇదీ మీపట్ల మీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్. ఈ కమిట్‌మెంటే గత పాలకులకు, మనకు మధ్య తేడాను చూపిస్తుంది.

వైద్యరంగంలో ఏపీ నంబర్ వన్

దేశంలోనే ఏపీ ఆస్పత్రులకు అత్యధికంగా 3,161 కాయకల్ప అవార్డులు

సాక్షి, అమరావతి: ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అందుబాటు, శానిటేషన్, ఇతర సదుపాయాల కల్పనపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తొలినుంచీ ప్రత్యేక దృష్టి పెడుతూ వస్తోంది. ఇందులో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛత, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. దేశంలోనే కాయకల్ప గుర్తింపు కలిగిన అత్యధిక ఆస్పత్రులు ఏపీలోనే ఉండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ పార్లమెంట్‌లో వెల్లడించింది. 2022–23లో దేశవ్యాప్తంగా 20,336 ప్రభుత్వ ఆస్పత్రులకు ఈ అవార్డులను కేటాయించారు. ఇందులో 3,161 ఆస్పత్రులకు అవార్డులు పొందిన ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. 2,619 ఆస్పత్రులతో తమిళనాడు రెండో స్థానంలో, 2,414 ఆస్పత్రులతో ఒడిశా మూడో స్థానంలో నిలిచాయి. తెలంగాణలో 734, కర్ణాటకలో 371, కేరళలో ఆస్పత్రులకు మాత్రమే అవార్డులు లభించాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రుల్లో జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించే విభాగంలోనూ ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 2022–23లో దేశవ్యాప్తంగా 2,041 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) లభించగా.. ఇందులో 18 శాతం ఆస్పత్రులు ఏపీ నుంచి ఉన్నాయి.

23న తిరుమలలో 'అఖండ పారాయణం'

తిరుమల: డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను పారాయణం చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. ఇందులో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద వర్సిటీ అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత వర్సిటీకి చెందిన శాస్త్రీయ పండితులు, టీటీడీ వేదపండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు పాల్గొంటారు.

ఏపీలో అవ్వాతాతల పింఛను రూ.3వేలకు పెంపు

తుది ఆమోదం కోసం నేటి కేబినెట్ సమావేశం ముందుకు..

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించనుంది. వీరికి ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల తుది ఆమోదం ఫైలు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు రానుంది. నిజానికి.. 2024 జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచనున్నట్లు సీఎం నెలన్నర క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800 కోట్లకు పైగా ఖర్చుచేస్తుండగా.. జనవరి నుంచి జరిగే పెంపు అనంతరం అది రూ.2,000 కోట్లకు పెరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,33,781 మంది లబ్ధిదారులు పింఛన్లు పొందారు.

ఏఏజీగా తేరా రజనీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఆ బాధ్యతలను తప్పించే వరకు ఆయన ఈ పోస్టులో కొనసాగుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రజనీకాంత్ అత్యంత సన్నిహితుడు. గత ప్రభుత్వ హయాంలో అనేక అంశాలపై రేవంత్‌రెడ్డి హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసి న్యాయపోరాటం చేశారు. రేవంత్ తరపున రజనీకాంత్ ఆ వ్యాజ్యాల్లో వాదనలు వినిపించారు. ముఖ్యమైన కేసులన్నీ కూడా రజనీకాంత్‌తో చర్చించేవారు. రజినీకాంత్ 45 ఏళ్లకే అదనపు ఏజీగా అవకాశం దక్కింది. తెలంగాణ, ఏపీ, ఉమ్మడి హైకోర్టులలో చూసినా అతిపిన్న వయసులో ఏఏజీ బాధ్యతలు చేపడుతున్న న్యాయవాదిగా తేరా రికార్డు కెక్కనున్నారు. తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత రెండవ ఏఏజీగా వ్యవహరించనున్నారు. రజనీకాంత్ స్వస్థలం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పిన్నఊర. ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2004లో న్యాయవాదిగా హైకోర్టులో ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో 200లకు పైగా, తెలంగాణ హైకోర్టులో 300పైగా కేసులు వాదించారు. హైకోర్టులో ఏపీ జెన్‌కో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2019లో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా గెలిచారు. పలు ట్రిబ్యునళ్ల తరపున న్యాయవాదిగా కూడా వ్యవహరించారు.

జీఓ 87 అమలుపై స్టే ఇవ్వలేం

- విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు భూ కేటాయింపుపై హైకోర్టు విచారణ
- కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కుల సంఘాలకు తక్కువ ధరకు భూ కేటాయింపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెవెన్యూ భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లతో పాటు విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై నాలుగువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణ వాయిదా వేసింది. భూకేటాయింపు జీఓపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని సర్వే నంబర్ 41/40లో 6.35 ఎకరాలను రూ.100 చొప్పున (ఎకరం) కేటాయిస్తూ 2023, ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 87ను జారీ చేసింది. దాదాపు రూ.100 కోట్లు విలువచేసే ఎకరం భూమిని రూ.100 చొప్పున కేటాయించారంటూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త సుంకర నరేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అత్యంత విలువైన భూమిని చౌకగా కేటాయించడం సరికాదని పిటిషనర్ తరపు న్యాయవాది శశికిరణ్ వాదించారు. జీఓ అమలును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని కోరారు. ఆలిండియా వెలమ సంఘానికి ఖానామెట్‌లో 5 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓపై ఇదే హైకోర్టు స్టే ఇచ్చిందని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంరక్షణగా మాత్రమే ఉంటుందని, అటువంటి భూములను అన్నివిధాలా పరిరక్షించాలని, కుల ప్రాతిపదికన భూ కేటాయింపు సుప్రీం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులు వాదన వినకుండా స్టే ఇవ్వలేమని చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

విశాఖ ఇండస్ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం

డాబాగార్డెన్స్(విశాఖ): జగదాంబ జంక్షన్ సమీపంలోని ఇండస్ హాస్పటల్లో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, అగ్నిమాపక, జీవీఎంసీ సిబ్బంది చేపట్టిన ముమ్మర సహాయక చర్యలతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కొంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అయినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు ఆర్డీవో తెలిపారు. మిగిలిన అంతస్తులకు మంటలు, పొగ వ్యాపించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విచారణ అనంతరం సీఎం జగన్‌కు నివేదిక పంపనున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బందితో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందం.. చికిత్స పొందుతున్న పేషెంట్లను సమీపంలోని మెడికవర్, విజేత ఆస్పత్రులకు తరలించారు. 30 మందిని విజేత ఆస్పత్రికి, 17 మందిని మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరు వెంటిలేటర్లపై ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

జిల్లా వార్తలు

నేటి నుంచి 'సెయింట్ ఆన్స్' క్రీడలు

హాజరుకానున్న 2వేల మంది క్రీడాకారులు



పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: దక్షిణ భారతదేశ స్థాయి సెయింట్ ఆన్స్ క్రీడోత్సవాలు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరగనున్నాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రీజియన్‌లోని 28పాఠశాలలకు చెందిన దాదాపు 2వేల మంది క్రీడాకారులు హాజరవుతారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖో–ఖో, త్రోబాల్ అంశాల్లో పోటీలు జరగనుండగా, ఏర్పాట్లు పూర్తిచేశామని పాఠశాల కరస్పాండెంట్ మరియ సుందరి, ప్రధానోపాధ్యాయురాలు నక్షత్రం తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించే పోటీల నిర్వహణలో జిల్లాలోని 50 మంది పీఈటీలు పాలుపంచుకుంటారని వెల్లడించారు.

మధిర మండలవాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న గాంధీ

మధిరరూరల్: మధిర మండలం కృష్ణాపురానికి చెందిన డాక్టర్ గుజ్జు గాంధీకి బెస్ట్ యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. మలేరియా విస్తృతి, నిర్మూలన అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి ఈ అవార్డు ప్రకటించారు. కేరళలోని క్యాలికట్ యూనివర్సిటీ నుంచి అవా ర్డు అందుకోగా గ్రామస్తులు అభినందించారు.

సింగరేణిలో సలహాదారుల తొలగింపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల్లో సలహాదారులుగా కొనసాగుతున్న వారిని తొలగిస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థలో పనిచేసి రిటైర్ అయిన సీనియర్లను సలహాదారులుగా నియమించారు. ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగా ప్రభుత్వ సలహాదారులను తొలగించారు. ఇదే తరహాలో సింగరేణిలోని సలహాదారులతో పాటు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రిటైర్డ్ ఎస్పీ సీహెచ్.శశిధర్ రాజును కూడా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆశ్రమ పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్, అధికారులు



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి

- తొలిరోజు విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్
- విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపు

పాల్వంచ: పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి గిరిజన పాఠశాలల క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పి.మణెమ్మ, ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ కె.విజయలక్ష్మి జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో దమ్మపేట, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, దుమ్ముగూడెం, వైరా, ఖమ్మం డివిజన్ల నుంచి విద్యార్థులు హాజరుకాగా, వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ, క్యారమ్స్, ఖో–ఖో, చెస్, అథ్లెటిక్స్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. తొలిరోజు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏ ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈమేరకు నైపుణ్యం కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ శోభారాణి, సర్పంచ్ వీరకుమారి, హెచ్ఎం ఎన్.చందు, ఏసీఎంఓలు ఈ.రమణయ్య, డి.నాగేశ్వరరావు, ఎస్.కే.జహీరుద్దీన్, చంద్రమోహన్, పి.నర్సింహారావు, బి.రూపాదేవి, ఎన్.తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు బి.నామానాయక్, ఎల్.రవి, సీహెచ్.బుచ్చారాములు, బి.శారద, డి.వీరమ్మ, బి.సుభద్ర, పీఈటీలు బి.గోపాలరావు, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుకు పోరాడుతాం

మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత



మాట్లాడుతున్న ఎంపీ కవిత, పక్కన కాంతారావు

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలుచేసేంత వరకు పోరాడుతామని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత స్పష్టంచేశారు. కరకగూడెం మండలం కుర్నవల్లిలో పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును ఆమె గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనునిత్యం ప్రజల కోసం పనిచేస్తూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన కాంతారావు ఓడిపోవడం బాధాకరమని తెలిపారు. అయితే, ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజల సమస్యలపై పోరాడుతామని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, చిన్న విరామం వచ్చినా రెట్టించిన వేగంతో ముందుకు సాగుదామని తెలిపారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, ఎంపీపీ రేగా కాళిక, నాయకులు రామకొండరెడ్డి, బిక్కసాని శ్రీనివాస్, వళ్లూరుపల్లి వంశీకృష్ణ, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారికి మావోల హెచ్చరిక

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపులకు కోళ్లు సరఫరా చేస్తున్న ఓ వ్యాపారిని మావోయిస్టులు హెచ్చరించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచకు చెందిన చిరు వ్యాపారి సుక్మా జిల్లాలోని దబ్బమరక, పోటక్‌పల్లిల్లో సీఆర్‌పీఎఫ్ క్యాంపులకు కోళ్లు, చేపలు సరఫరా చేస్తున్నాడు. ఈక్రమంలోనే బుధవారం ఉదయం ఆయన తన ద్విచక్రవాహనంపై కోళ్లు, చేపలు తీసుకుని దుమ్ముగూడెం మండలం పెదనల్లబల్లి మీదుగా వెళ్తుండగా పోటక్‌పల్లి–దబ్బమరక మధ్య అటవీప్రాంతంలో మావోయిస్టులు అడ్డుకున్నారు. ఆయన నుంచి చేపలు, కోళ్లతో పాటు ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని హెచ్చరించి వదిలేశారు. మరోమారు పోలీసు క్యాంపులకు సామగ్రి చేరవేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని మావోయిస్టులు హెచ్చరించినట్లు తెలిసింది.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించుకోవాలి

కారేపల్లి: రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించడం ద్వారా మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ మల్లేశం సూచించారు. కారేపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీప్రియ కోటెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రైతులు తీసుకొచ్చిన పత్తి నాణ్యత, ధరపై పరిశీలించి మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీసీఐ ద్వారా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.71 కోట్ల విలువైన 10,189 మెట్రిక్ టన్నులు పత్తిని 3,817 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ఇక ఖమ్మం జిల్లాలోని ఎనిమిది కేంద్రాల ద్వారా రూ.108 కోట్ల విలువైన 15,548 మెట్రిక్ టన్నులు పత్తిని 6003 మంది రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీడీ రాజు, కార్యదర్శి నరేష్‌తో పాటు కోటేశ్వరరావు, రఘు తదితరులు పాల్గొన్నారు.



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

అధికార ప్రయోజనాల కోసమే చీలికలు

- బీజేపీతో మతోన్మాదం రూపంలో ప్రమాదం
- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: అధికార ప్రయోజనాలు పొందేందుకు, అధికారాన్ని కాపాడుకునేందుకు దేశంలో బీజేపీ ప్రజల మధ్య చీలికలు తీసుకొస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ బీజేపీ రూపంలో మతోన్మాద ప్రమాదం పొంచి ఉన్నందన... తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాగా, దేశంలోని మూడు ప్రధాన విప్లవ పార్టీలైన పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్ ఐక్యం కాబోతున్నాయని, ఇందుకోసం ఖమ్మం కేంద్రంగా వచ్చే మార్చి 3, 4, 5వ తేదీల్లో ఐక్యతా సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, దేశంలో రెండు దఫాలుగా అధికారంలోకి వచ్చిన బీజేపీ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని అస్థిర పరిస్థితులను సృష్టించిందని ఆరోపించారు. కాశ్మీర్‌లో 370, 35ఏ ఆర్టికల్స్ రద్దుచేసి స్వయం ప్రతిపత్తి లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందని చెప్పారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తొలగించి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఇక రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ, అవినీతి, దుష్ట విధానాలతో ఓటమి పాలయ్యాడన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరావు, కంకనాల అర్జున్‌రావు, ఆవుల అశోక్, సీ.వై.పుల్లయ్య, ఏ.వెంకటరెడ్డి, జి.రామయ్య, ఆర్.శివలింగం, బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, సీహెచ్.శిరోమణి, టి.ఝాన్సీ, ఆవుల మంగతాయి, పి.శోభ, కె.శ్రీనివాస్, కమ్మకోమటి నాగేశ్వరరావు, గద్దం లక్ష్మణ్, ఎన్.వీ.రాకేష్, వి.వెంకటేష్, కొలేటి నాగేశ్వరావు, తిమ్మిడి హన్మంతరావు, పాశం అప్పారావు, ఏ.శరత్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గి.. పెరిగిన తాలిపేరు నీటిమట్టం



తాలిపేరు ప్రాజెక్టులో గరిష్టస్థాయికి చేరువగా ఉన్న నీటిమట్టం

- ప్రస్తుతం 73.85 మీటర్ల మేర నీరు
- రబీ సాగుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నీటిమట్టం గత నెలలో గణనీయంగా పడిపోగా రబీకి సాగునీటి లభ్యతపై రైతులు ఆందోళన చెందారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 అడుగులు కాగా, నవంబర్ 1న 73.83 మీటర్లుగా ఉన్న నీటిమట్టం రోజురోజుకు తగ్గుతూ వచ్చింది. నవంబర్ 5వ తేదీ నాటికి 73.80 మీటర్లకు పోడిపోగా, 25న 73.13 మీటర్లకు చేరింది. ఇదిలాగే కొనసాగితే డిసెంబర్‌లో 72 మీటర్ల దిగువకు పడిపోయి రబీ పంటలకు నీటి విడుదల కష్టమేనని భావించారు. ఇంతలోనే తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో పెరుగుతూ వచ్చిన నీమట్టం గురువారం సాయంత్రానికి 73.85 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టమైన 74 మీటర్లకు ఇంకా 15 సెం.మీ. మేర నీరు చేరితే సాగునీటికి డోకా ఉండదని చెబుతున్నారు. కాగా, ఖరీఫ్‌లో ఆలస్యంగా వరినాట్లు వేసిన వారికి మరో ఇరవై రోజుల పాటు సాగునీరు విడుదల చేయాల్సి ఉండగా, ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఉండడంతో ఖరీఫ్‌లో వరి వేసిన రైతులకే కాక, యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ఇబ్బంది ఉండకపోవచ్చనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు తెలిసింది. కాగా, ప్రాజెక్టు పరిధి రెండో జోన్‌లో రబీ ఆరుతడి పంటలకు సాగునీటి విడుదలపై చర్చించేందుకు ఈనెల 16న అధికారులు రైతులతో సమావేశం కానున్నారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టులోకి నీరు చేరగా, రబీలో పంటలకు ఏ మేర సాగునీరు విడుదల చేస్తారనేది 16వ తేదీన తెలియనుంది.